ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- వచ్చే ఏడాది నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.
- శ్రీశైలం క్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు.
- రాష్ట్ర వ్యాప్తంగా రేపు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 135వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

====================

వచ్చే ఏడాది నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. వెలిగొండ పర్యటనలో భాగంగా ఈరోజు ముఖ్యమంత్రి ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించి, ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయిన రైతులకు పునరావాస సహాయం కింద 300 కోట్ల రూపాయలను పంపిణీ చేసిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. 4లక్షల 47వేల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందేలా వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని తెలిపారు. గంగా, కావేరి నదుల అనుసంధానం అవసరమని, పోలవరం ప్రాజెక్టును ఏడాదిలోగా పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్...24 సెకన్లు)

====================

పోలియో రహిత సమాజమే లక్ష్యంగా రేపు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రంలో 5 ఏళ్ల లోపు వయసున్న 49లక్షల 20వేల 239 మంది చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ రెండు చుక్కలు వేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. 29వేల 873 పోలియో బూత్‌లు, 59వేల 746 ఇంటింటి బృందాలు, 1,757 మొబైల్ టీమ్‌లు, 1,144 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 68.67 లక్షల డోసుల వ్యాక్సిన్‌ను జిల్లాలకు పంపిణీ చేశారు.

====================

చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పూర్తిగా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. సాలూరు పట్టణంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "బాలామృతం ప్లస్" పంపిణీ కార్యక్రమాన్ని ఈరోజు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "పోషకాహార లోపం లేని ఆంధ్రప్రదేశ్-ఆరోగ్యవంతమైన బాల్యం" అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. "బాలామృతం ప్లస్"ను ప్రవేశపెట్టడం చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో మరో కీలక అడుగుగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 7 నెలల నుంచి 5 సంవత్సరాల వయస్సు గల పోషకాహార లోపంతో బాధపడుతున్న సుమారు 5 వేల మంది చిన్నారులను గుర్తించి వారికి ప్రత్యేక పోషకాహారం అందించనున్నారు. ఈ

కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో ఎదుగుదల లోపాలను నివారించి, వారి శారీరక, మానసిక వికాసాన్ని మెరుగుపరచవచ్చని మంత్రి పేర్కొన్నారు.

=====================

రాష్ట్ర ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యం కోసమే సంజీవని పథకాన్ని తీసుకొచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మార్కాపురం జిల్లాలోని కిష్టంశెట్టిపల్లిలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అర్హులందరికీ తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని.. రైతులకు ఏటా 20 వేల రూపాయలు ఇస్తున్నామని అన్నారు. సంజీవని ద్వారా వేగవంతంగా వైద్య సేవలు అందజేస్తామని చెప్పారు. మన మిత్ర ద్వారా ఇంటి దగ్గరకే సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని పథకాన్ని అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

=====================

ప్రకృతి వ్యవసాయం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుందని వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్ తెలిపారు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న పీఎండీఎస్ క్షేత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విత్తన గుళికలతో సాగు చేసిన పంటల్లో అధిక మొలక శాతం, సమాన మొక్కల పెరుగుదల, నేలలో తేమ నిల్వ సామర్థ్యం మెరుగ్గా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల్లో రైతులు అంతర పంటలు సాగు చేయడం అభినందనీయమని, వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ ఇటువంటి సాగుతో స్థిరమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 135వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెళ్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే... ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

=====================

విరామం

=====================

శ్రీశైలం క్షేత్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీశైలం భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకున్న అనంతరం సున్నిపెంట వద్ద ఉన్న దేవస్థానం క్వార్టర్స్‌ను ఈరోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైల క్షేత్రం అభివృద్ధికి అటవీశాఖ నుంచి 4 వేల హెక్టార్ల భూమి కోసం కేంద్రాన్ని కోరామని వెల్లడించారు. భక్తుల రద్దీ దృష్ట్యా దోర్నాల-శ్రీశైలం, అమ్రాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణంపై జాతీయ రహదారుల సంస్థ పరిశీలన చేస్తోందని పేర్కొంటూ...

(వాయిస్...27 సెకన్లు)

=====================

పార్వతీపురం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ (సర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి ఈరోజు పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఓటరు జాబితాల సవరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాల సవరణకు సంబంధించిన పూర్తి సమాచారం ఓటర్లకు తెలియజేయాలని ఆదేశించారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లాలని స్పష్టం చేశారు.

=====================

గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ లో 'నషా ముక్త్ భారత్ అభియాన్ సప్తాహ్' ఈరోజు ఘనంగా ముగిశాయి. ఎయిమ్స్ మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్యాంపస్‌లో పలు వైవిధ్యభరితమైన అవగాహన

కార్యక్రమాలను నిర్వహించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, అధ్యాపకులు, వైద్య సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై సమాజానికి అవగాహన కల్పించడం, నివారణాత్మక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్' లక్ష్య సాధనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎయిమ్స్ వైద్య నిపుణులు పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యతని, మానసిక ఆరోగ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని వారు స్పష్టం చేశారు.

=====================

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటి పర్యావరణాన్ని రక్షించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు. "హరిత హారం" కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనకాపల్లిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య నివారణకు, పర్యావరణాన్ని కాపాడుకోవడానికి పచ్చదనం ఎంతో అవసరమన్నారు.

=====================

ఉపరితల ఆవర్తనము, ద్రోణి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు అనేక చోట్ల కురిసే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రము తెలిపింది. భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని, ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారిణి జి.లక్ష్మి తెలిపారు. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముందని పేర్కొన్నారు.

=====================

ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో 100 శాతం అడ్మిషన్లకు కృషి చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. భీమవరం నుంచి జిల్లాలో ఎస్సీ, బీసీ వసతి గృహాల అధికారులతో ఈరోజు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు.

=====================
=====================